క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

చిట్యాల: మండలంలోని జడలపేట క్రాస్ వద్ద నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నైన్‌పాక గ్రామం మీదుగా అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లు జడలపేట క్రాస్ వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. తనిఖీ చేయగా వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై ట్రాక్టర్ యజమానులైన కోటిలింగం, సతీష్, లింగారావు, సంపత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

పలిమెల: అధికారాలు అందుబాటులో ఉండి మండల ప్రజలకు మెరుగైన సేవలందించాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలిమెల మండలం ఏర్పడి ఆరు సంవత్సరాలు అవుతున్న తహసీల్దార్, వ్యవసాయ, మండల పరిషత్ వంటి ముఖ్యమైన శాఖలు మహదేవ్‌పూర్ మండలంలోనే ఏర్పాటు చేయడంతో చిన్న చిన్న పనులకు సైతం అధిక చార్జీ వెచ్చించి రైతులు, ప్రజలు అక్కడికి వెళ్లాల్సి వస్తుందన్నారు. తీరా కార్యాలయాల వద్ద వెళ్లిన వారికి అధికారులు ఉండకపోవడంతో నిరాశే ఎదురవుతుందని తెలిపారు. అధికారులు సమయపాలన పాటిస్తూ కార్యాలయాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నట్లు తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి



మహాముత్తారం: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ ఎస్సై సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు యామన్‌పల్లి ప్రధాన కుడలి వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహన పత్రాలను పరిశీలించారు. అనంతరం అనుమానితులను విచారించి వదిలేశారు. ఎస్సై వెంట సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు



మహాముత్తారం: మండలంలోని మీనాజీపేట గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని వివిధ వార్డుల్లో చెత్తను తొలగించి డ్రైనేజీలను శుభ్రం చేశారు. తొలగించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వేణుగోపాల్‌తో పాటు పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సేవాలాల్ జయంతి వేడుకలు



మహాముత్తారం: సేవాలాల్ జయంతి వేడుకలను మండలంలోని ప్రేమ్‌నగర్ తండాలో శుక్రవారం లంబాడీలు నిర్వహించారు. తండాలోని కులపెద్ద ఇంటివద్ద సేవాలాల్ మేరియమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రమ్య వంశిరాజ్, మహిళలు, తండావాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



మొగుళ్లపల్లి: ఫిబ్రవరి 9, 10, 11న బీహార్ పాట్నాలో జరిగిన 8వ జాతీయ స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ టోర్నమెంట్ 2023 అండర్ 16 కేటగిరి డిస్కస్‌త్రో పోటీలో మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రాకేష్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు గురుకుల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని శుక్రవారం ప్రిన్సిపాల్‌తో పాటు, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్, పాపారావు, పీఈటీ కార్తీక్, శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.

గణపురం: నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు.



టేకుమట్లలో..



రేగొండలో..



గ్యాస్ ధరలు తగ్గించాలని రాస్తారోకో



కాటారం: కట్టెలపొయ్యిపై వంట చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి

కాటారం: పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేశ్ అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి స్వయంగా రోడ్డుపై వంట చేసి బీజేపీ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలపై ధరల భారం మోపుతూ వారిని అధోగతిపాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట జనార్ధన్, యూత్ విభాగం జిల్లా నాయకుడు జక్కు రాకేశ్, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఎలుబాక సుజాత, మహదేవపూర్ ఎంపీపీ బాన్సోడ రాణిబాయి, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు భూపెల్లి రాజు, సబ్ డివిజన్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్, నాయకులు దబ్బెట రాజేశ్, దబ్బెట స్వామి, జోడు శ్రీనివాస్, రత్న సౌజన్య, గీతాబాయి, కుడుదుల రాజబాబు, బొడ్డు రాజబాబు, గట్టు రమేశ్, ముక్తి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను కేంద్ర ప్రభుత్వం వేంటనే తగ్గించాలని బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రామోదీ దిష్టిబొమ్మను మండల కేంద్రంలో దహనం చేశారు. ఈ క్రమంలో అడ్డుకోబోయిన ఓ కానిస్టేబుల్ వేలుకు గాయం అయింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్హర్: పెరిగిన వంట గ్యాస్ ధరలకు నిరసిస్తూ మండలంలోని కొయ్యూర్ సెంటర్‌లో బీఆర్ఎస్ మండల మహిళ అధ్యక్షురాలు పంతకాని చంద్రకళ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు పలు మార్లు వంట గ్యాస్ ధరలను పెంచుతూ సామాన్యులపై మోయలేని భారన్ని మోపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగమూర్తి, మండల కోఆప్షన్ సభ్యుడు అయూబ్‌ఖాన్, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సుమన్, మండల ఉపాధ్యక్షుడు బాపు యాదవ్, మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్ సమ్మయ్య, ఉప సర్పంచ్‌లు శ్రీశైలం, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌పై రూ.50 పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ నిరుపేదలపై భారం మోపుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు సంగి రవి, ఆకునూరి తిరుపతి, బొడ్డు సదానందం గునిగంటి మహేందర్, ఆది రఘు, పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, గండం సారయ్య, బండెల నరేష్, నందికొండ మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేగొండలో..

రేగొండ మండల కేంద్రంలో, గోరికొత్తపల్లిలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆధ్వర్యంలో గ్యాస్ ధర పెంపకంపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రేగొండ మండల కేంద్రంలో వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, టౌన్ అధ్యక్షుడు కొలెపాక భిక్షపతి, మోడెం ఉమేష్‌గౌడ్, మటిక సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

గణపురం: పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి మోతె కరుణాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను పెంచి అధిక భారం మోపుతున్నారని మండిపడ్డారు. నాడు గ్యాస్ ధర రూ.400 ఉంటేనే బీజేపీ నాయకులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు కానీ నేడు కేంద్ర ప్రభుత్వమే అడ్డగోలుగా ధరలను పెంచుతూ సామాన్య ప్రజలపై తీవ్రభారం పెంచుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, మండల, మహిళా, గండ్ర యువసేన నాయకులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరలు పెంచి పేదల ప్రజల నడ్డి విరుస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధరల పెంపునకు నిరసనగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జోరుకు సదయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్ పెంచడంతో సామాన్య ప్రజలు సతమతం అవుతున్న తరుణంలో వంట గ్యాస్ ధరలు పెంచి మరింత భారం మోపిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రాజేశ్వరరావు, స్థానిక సర్పంచ్ మోటె ధర్మారావు, ఎంపీటీసీలు దండ వెంకటేశ్వర్‌రెడ్డి, మంద సుధాకర్, నాయకులు శ్రీనివాస్, అశోక్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.



గోరికొత్తపల్లిలో..



మల్హర్: కొయ్యూరు సెంటర్‌లో..



మొగుళ్లపల్లిలో..



చిట్యాల: ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

చెరువు తూము పరిశీలన



తూమును పరిశీలిస్తున్న ఏఈ

మహాముత్తారం: మండలంలోని కొర్లకుంట ఊరచెరువు తూముతోపాటు పంట పొలాల్లోకి నీరు వెళ్లే కాల్వ కూరుకుపోయింది. దీంతో సర్పంచ్ ముక్కెర నవీన్‌గౌడ్ నీటిపారుదల శాఖ అధికారులకు సమస్యను విన్నవించారు. వెంటనే స్పందించిన అధికారులు ఏఈ యాకయ్యను తూము, కాల్వను పరిశీలించాలని ఆదేశించడంతో శుక్రవారం ఏఈ స్థానిక సర్పంచ్‌తో కలిసి తూమును కాల్వ పరిశీలించారు. పై అధికారులకు సమస్యను తెలిపి వారం రోజుల్లో పనులు చేపట్టే విధంగా తగు చర్యలు తీసుకుంటామని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుపతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దతూండ్లలో ఫీల్డ్ ట్రైనింగ్



విలేజ్ మ్యాప్‌తో సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

మల్హర్: స్వచ్ఛ భారత్ మిషన్ శిక్షణలో భాగంగా రెండో రోజు పెద్దతూండ్ల గ్రామంలో ఎస్‌బీఎం జిల్లా అధికారులు శుక్రవారం ఫీల్డ్ ట్రైనింగ్ నిర్వహించారు. విలేజ్ మ్యాప్ వేసి పరిస్థితులను వివరించారు. ఒకే గుంత ఉన్న మరుగుదొడ్డికి రెండు గుంతల విధానం, కమ్యూనిటీ సోక్ ఫిట్ గురించి ప్రత్యేక్షంగా టెక్నికల్ అంశాలను పాటిస్తూ వివరించారు. అనంతరం గ్రామంలోని ఇళ్లను సందర్శించి సానిటేషన్ స్థితిగతుల గురించి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు వెంకటేష్, నాగేందర్, భాస్కరెడ్డి, నితిన్, ఎంపీడీఓ నరసింహామూర్తి, ఎంపీపీఓ విక్రమ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

చిగురుపల్లిలో తాగు నీటి తిప్పలు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న పల్లెవాసులు

మల్హర్: మండలంలోని రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని చిగురుపల్లిలో తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పల్లెవాసులు ఖాళీ బిందలతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మిషన్ భగరీథ పైప్‌లైన్‌ల ద్వారా సక్రమంగా నీళ్లు సరఫరా కావడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులు తాగు నీటి సమస్యను ఎదుర్కొంటున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లక్ష్మయ్య, రమేష్, గట్టయ్య, లక్ష్మయ్య, బొందమ్మ, మౌనిక, బక్కమ్మ, లక్ష్మి, పోషమ్మ ఉన్నారు.

మొక్కలను జాగ్రత్తగా పెంచాలి



కాళేశ్వరం: మొక్కలు పరిశీలిస్తున్న అధికారులు



పలిమెలలో..

కాళేశ్వరం: నర్సరీలోని మొక్కలను జాగ్రత్తగా పెంచాలి ఎంపీడీఓ శంకర్ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని మెట్‌పల్లి కాళేశ్వరం నర్సరీలోని మొక్కలను ఆయన శుక్రవారం పరిశీలించారు. వేసవిలో మొక్కలు ఎండకుండ చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మెట్‌పల్లి పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట సర్పంచ్‌లు శోభ, వసంత, ఈజీఎస్ ఏపీఓ రమేష్, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

పలిమెల: మండలంలోని పలిమెల, సర్వాయిపేట గ్రామ పంచాయతీల పరిధిలోని నర్సరీలను ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలోని మొక్కలు పెరిగేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని, కలుపు తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సురేందర్, వాచర్స్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌కు నిధుల కోత సరికాదు



ధర్నాలో మాట్లాడుతున్న రత్నం రాజేందర్

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయింపులో నిధుల కోత విధించడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలో 48 గంటల ధర్నా చేపట్టారు. ముందుగా జిల్లాకేంద్రంలోని జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుతున్న పోషక ఆహారాన్ని దూరం చేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఐసీడీఎస్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం విరమించుకోవాలని అన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నేరుగా గ్యాస్ సిలిండర్‌లను అందించాలని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి అమ్జద్‌పాషా, నర్సింహ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొట్ల కార్తీక్‌లు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు సరోజన, సమ్మక్క, పద్మ, వెంకటరమణ, భాగ్య, జమున, మంజూల, సూరమ్మ, సార్వతి, రుక్మిని, విజయలక్ష్మి, సరిత, సంధ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



ఉపాధ్యాయులతో విద్యార్థులు

చిట్యాల: మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలోని స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఒక రోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా నీరటి సౌమ్య, డీఈఓగా కట్కూరి మణికంఠ వ్యవహరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా పని చేసిన తీరును వారి అనుభవాలను పంచుకొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయులు సుదయ్య, సదయ్య, సుజాత, నీలిమారెడ్డి, రాజమౌళి, రామ్ నారాయణ, ఉస్మాన్ అలీ, సరళ, విజయలక్ష్మి, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా శ్రీనాథ్, ఎంఈఓగా అనిల్‌కుమార్, హెచ్‌ఎంగా సుమంత్, ఎస్‌ఎంసీ చైర్మన్‌గా గోపిచంద్‌లు వ్యవహరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి చక్కగా బోధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ మహేందర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'జాతర'కు ఏర్పాట్లు

ములుగు రూరల్: ములుగు మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధి దేవునిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి జాతరకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇండ్ల అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 06న స్వామి వారి కల్యాణమహోత్సవం, 07న పూర్ణహిత హోమం, గుడి చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదర్శన ఉంటుందని అన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



బాలామృతం, కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్

చిట్యాల: మహిళలు హక్కులపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ రత్నాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నవాబుపేట గ్రామంలోని రెండవ అంగన్‌వాడీ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారమైన బాలమృతం, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శారద, రమ, రాజేశ్వరి, ఆయాలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



మొగుళ్లపల్లి: శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ



మహదేవపూర్: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మహదేవపూర్: కంటివెలుగు శిబిరంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని కుదురుపల్లి గ్రామంలో నిర్వహించిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం క్రీడా ప్రాంగణంలో కొనసాగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మెట్‌పల్లి గ్రామపంచాయతీలోని రికార్డులను పరిశీంచారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాయత్రి, ఈజీఎస్ ఏపీఓ రమేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ లోకుల పోచం, వనసేవక్ తదితరులు ఉన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

మండలంలోని పెద్దంపేట గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కురుసం సత్య శుక్రవారం ప్రారంభించారు. ప్రజలందరూ కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రమోద్, ఏఎన్ఎంలు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ జోరుక సదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని రంగాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారిని నాగరాణి, సవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి సర్పంచ్ బల్గూరి తిరుపతిరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు తెలంగాణ రాష్ట్రంలో కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఈ పథకం రూపుదిద్దుకుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోల్నేని రాజేశ్వర్‌రావు, సర్పంచ్ బల్గూరి తిరుపతిరావు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ, ఉపసర్పంచ్‌లు

కాటారం: మండలంలో సీసీ రోడ్లు, సైడ్ కాల్వలు, మరుగుదొడ్లు, నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు ఇసుక అనుమతులు ఇవ్వాలని కోరుతూ ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఆధ్వర్యంలో శుక్రవారం అడిషనల్ కలెక్టర్ దివాకరకు జిల్లా కేంద్రంలో వినతిపత్రం సమర్పించారు. గోదావరి, స్థానిక వాగుల్లో ఇసుక ఉన్నందున అభివృద్ధి పనుల నిమిత్తం ఇసుక రవాణా కోసం తహసీల్దార్‌ను అనుమతులు కోరితే ఆర్డీఓకు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో అనుమతులు తీసుకోవడం ఆలస్యం అయి అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతుందని వివరించారు. ఇసుక రవాణాకు త్వరితగతిన అనుమతులు వచ్చేలా చూడాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కాటారం, నస్తూర్‌పల్లి ఉపసర్పంచ్‌లు నాయిని శ్రీనివాస్, అయిత వినయ్, మాచెర్ల రాజు, మధూకర్, బోడ శ్రీనివాస్, కారెంగల సమ్మయ్య, చీమల సందీప్ ఉన్నారు.